www.prajavinikidi.com

RNI.No :TELTEL/2023/85745

# ప్రజా వినికిడి

మా అక్షరం-మీ ఆయుధం

తెలుగు దినపత్రిక

విలేకరులు కావలెను

తెలంగాణ, ఆంధ్ర రాష్ట్ర వ్యాప్తంగా వెలువడుచున్న

ప్రజా వినికిడి

మా అక్షరం-మీ ఆయుధం తెలుగు దినపత్రిక

తెలుగు దినపత్రిక నందు పనిచేయుటకు

జర్నలిజంపై ఆసక్తి కలిగిన విలేఖరులు కావలెను

ఆసక్తి గలవారు సంప్రదించండి

8978701613,70306545

సంపుటి - 2 సంచిక -229 శుక్రవారం1 నవంబర్ 2024 ఎడిటర్ : మారేపల్లి అశోక్ పేజీలు -4 వెల - 3/-

Published From Hyderabad : Cerculated in Hyderabad Rangareddy,Nalgonda,Khammam,Warangal,Mahaboobnagar,Medak and All Distircts

## అభివృద్ధి లక్ష్యంగా వేసే అడుగులకు

# సైనికులే రక్షకులు

### : ప్రధాని మోదీ


**అంగుళం భూమి విషయంలోనూ రాజీపడేది లేదన్న ప్రధాని**

**సైనికులపై దేశ ప్రజలకు అచంచలమైన విశ్వాసం ఉందని వ్యాఖ్య**

**సైనికుల వల్లే దేశం సురక్షితంగా ఉందని ప్రజలు భావిస్తున్నారన్న మోదీ**

కచ్ / హైదరాబాద్‌ప్రజావినికిడి,:
భారత్‌ను అభివృద్ధి చెందిన దేశంగా తీర్చిదిద్దే లక్ష్యంతో అడుగులు వేస్తున్నామని, ఆ కలలకు సైనికులే రక్షకులని ప్రధాని నరేంద్రమోదీ అన్నారు. గుజరాత్‌లోని కచ్‌లో సైనికులతో కలిసి ఆయన దీపావళి వేడుకల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... దేశ సరిహద్దుల్లో ఒక్క అంగుళం భూమి విషయంలో కూడా రాజీపడేది లేదన్నారు. మన సైనికులపై దేశ ప్రజలకు అచంచలమైన విశ్వాసం ఉందన్నారు. భారత్ ఎప్పుడూ తన శత్రువుల మాటలను వినదని... సైనికుల దృఢ నిశ్చయాన్ని మాత్రమే విశ్వసిస్తుందన్నారు. సైనికుల వల్లే దేశం సురక్షితంగా ఉందని ప్రజలంతా భావిస్తున్నారని తెలిపారు. సరిహద్దు ప్రాంతంలో మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేయడమే తమ ప్రథమ ప్రాధాన్యమన్నారు. ఆర్మీ, నేవీ, ఎయిర్ ఫోర్స్ వేర్వేరుగా ఉన్నప్పటికీ త్రివిధ దళాలు ఒక్కచోట చేరితే మన శక్తిసామర్థ్యాలు పెరుగుతాయన్నారు.

మిగతాది 2లో...





## మద్యం అమ్మకాల్లో

# తెలంగాణ టాప్

**రెండో స్థానంలో ఏపీ**

**దక్షిణాదిన రెండో స్థానంలో నిలిచిన ఆంధ్రప్రదేశ్**

**సగటున ఒక్కొక్కరు రూ.1,623 విలువైన మద్యం తాగినట్లు వెల్లడి**

**ఏపీలో సగటున ఒక్కొక్కరు రూ.1,306 ఖర్చు చేసినట్లు వెల్లడి**



హైదరాబాద్‌ప్రజావినికిడి,:
మద్యం అమ్మకాల్లో తెలంగాణ టాప్‌గా నిలిచింది. రాష్ట్రంలో ప్రతిరోజూ లక్షలాది లీటర్ల మద్యం విక్రయాలు సాగుతున్నాయి. దక్షిణ భారతదేశంలో మద్యం అమ్మకాల్లో తెలంగాణ మొదటి స్థానంలో నిలిస్తే, ఆంధ్రప్రదేశ్ రెండో స్థానంలో నిలిచింది. తెలంగాణలో గత ఏడాది సగటున ఒక్కొక్కరు రూ.1,623 మద్యం కోసం ఖర్చు చేయగా... ఏపీలో రూ.1,306 ఖర్చు చేసినట్లు ఢిల్లీలోని నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ పబ్లిక్ ఫైనాన్స్ పాలసీ (ఎన్ఐపీఎఫ్‌పీ) అంచనా వేసింది.పంజాబ్‌లో రూ.1,245, ఛత్తీస్‌గఢ్‌లో రూ.1,227 చొప్పున ఒక్కో వ్యక్తి ఖర్చు చేశారు. పశ్చిమ బెంగాల్, ఉత్తర ప్రదేశ్, రాజస్థాన్, త్రిపుర, మధ్యప్రదేశ్ రాష్ట్రాలలోని వ్యక్తులు మద్యం కోసం తక్కువ ఖర్చు చేస్తున్నారు. తెలంగాణలో 2,620 మద్యం దుకాణాలు ఉన్నాయి. మరో వెయ్యి వరకు బార్లు, పబ్స్ ఉన్నాయి. ఇటీవల దసరా సందర్భంగా దాదాపు రూ.1,000 కోట్ల మద్యం విక్రయాలు జరిగాయి. 11 లక్షల కేసుల మద్యం, 18 లక్షల కేసుల బీర్ల విక్రయాలు జరిగినట్లు అంచనా.దక్షిణాదిన తెలంగాణలోనే బీర్ల విక్రయాలు అత్యధికంగా అమ్ముడవుతున్నాయని సర్వేలో వెల్లడైంది. ఏప్రిల్ నుంచి అక్టోబర్ మధ్య బీర్లు తాగిన వారి సంఖ్య 302.84 లక్షలు అని వెల్లడైంది. ఏపీలో 169 లక్షల బీర్లు అమ్ముడయ్యాయి. మద్యం వల్ల తెలంగాణలో ఖజానాకు భారీగా ఆదాయం వచ్చింది

## ఝార్ఖండ్ స్టార్ క్యాంపెయినర్ల జాబితాలో భట్టి విక్రమార్క

**స్టార్ క్యాంపెయినర్ల జాబితాను విడుదల చేసిన కేసీ వేణుగోపాల్**

**జాబితాలో ఖర్గే, సోనియా, రాహుల్, ప్రియాంక గాంధీ**

**ఝార్‌ఖండ్ లో ఓ వీధిలో ఛాయ్ తాగిన భట్టివిక్రమార్క**



ఝూర్ ఖండ్ అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ స్టార్ క్యాంపెయినర్ జాబితాలో తెలంగాణ ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క పేరును అధిష్ఠానం ప్రకటించింది. ఈ మేరకు ఏఐసీసీ జనరల్ సెక్రటరీ కేసీ వేణుగోపాల్ నేడు జాబితాను విడుదల చేశారు.ఈ జాబితాలో ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, కాంగ్రెస్ అగ్రనేతలు సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీతో పాటు భట్టివిక్రమార్క కూడా ఉన్నారు.మరోవైపు, భట్టి విక్రమార్క ఇప్పటికే ఝూర?ండ్ ఎన్నికల ప్రచారంలో బిజీగా ఉన్నారు. అక్కడి నేతలతో సమావేశమవుతున్నారు. వీధుల్లో తిరుగుతూ ప్రజల వద్దకు వెళుతున్నారు. ఝూర?ండ్‌లో తన పర్యటనకు సంబంధించి భట్టివిక్రమార్క ఎక్స్ వేదికగా పంచుకున్నారు. బోకారోలో ఓ చాయ్ దుకాణంలో టీ తాగారు. వారితో ముచ్చటిస్తూ సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఇందుకు సంబంధించిన వీడియోను పోస్ట్ చేశాడు.

# కేసీఆర్ ప్రభుత్వానికి సమయం ఇస్తున్నారు

**కేసీఆర్ చాలా ఆరోగ్యంగా ఉన్నారు: ఎక్స్ వేదికగా కేటీఆర్ ..!**

**కేసీఆర్ బాధ్యతగల ప్రతిపక్ష నేతగా ప్రభుత్వానికి సమయం ఇస్తున్నారని వెల్లడి**

**ప్రస్తుత రాజకీయాలు ఏమాత్రం బాగాలేవన్న కేటీఆర్**

**ఓ సమయంలో తాను రాజకీయాల నుంచి వైదొలగాలనుకున్నానని వెల్లడి**



హైదరాబాద్‌ప్రజావినికిడి,:
కేసీఆర్ చాలా ఆరోగ్యంగా ఉన్నారని, తమకు మార్గనిర్దేశనం చేస్తున్నారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ వెల్లడించారు. ఎక్స్ వేదికగా 'ఆస్క్ కేటీఆర్' పేరుతో నెటిజన్లతో ఆయన ముచ్చటించారు. ఈ సందర్భంగా నెటిజన్లు అడిగిన పలు ప్రశ్నలకు సమాధానం చెప్పారు. 2025 నాటికి కేసీఆర్ ప్రజల్లోకి విస్తృతంగా వెళతారన్నారు. బాధ్యత గల ప్రతిపక్ష నేతగా కేసీఆర్ ప్రభుత్వానికి సమయం ఇస్తున్నారని తెలిపారు. ప్రస్తుత రాజకీయాలు ఏమాత్రం బాగా లేవన్నారు. కుటుంబ సభ్యులను కూడా రాజకీయాల్లోకి లాగుతున్నారని విమర్శించారు. రాజకీయాల్లోకి వారిని ఎందుకు లాగుతున్నారో అర్థం కావడం లేదన్నారు. తాము అధికారంలో ఉన్నప్పుడు ఇలాంటివి చేయలేదన్నారు. తన పద్దెనిమిదేళ్ల రాజకీయ జీవితంలో తన కుటుంబ సభ్యులు కూడా ఇబ్బందిపడవలసి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఓ దశలో రాజకీయాల నుంచి బయటకు పోవాలని భావించానని... కానీ ప్రజల కోసం ధైర్యంగా నిలబడటమే మంచిదని కొనసాగుతున్నట్లు చెప్పారు.


మిగతాది 2లో...

# మూసీ ప్రాంతంలో కేసీఆర్‌కు ఇల్లు, బెడ్ ఏర్పాటు చేసిన కాంగ్రెస్ నాయకులు

**మూసీ ప్రాంతంలో కేసీఆర్, ఈటల రాజేందర్ ఉండాలన్న కాంగ్రెస్ నాయకులు**

**ఈ ప్రాంతంలో ఉంటే కానీ ప్రజల బాధలు తెలియవన్న కాంగ్రెస్ నాయకులు**

**రేవంత్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం**



హైదరాబాద్‌ప్రజావినికిడి,:
మాజీ సీఎం, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌కు మూసీ పరీవాహక ప్రాంతంలో... కాంగ్రెస్ నేతలు ఇంటిని, బెడ్‌ను ఏర్పాటు చేశారు. ఈ మేరకు మూసారాంబాగ్ ప్రాంతంలోని స్థానిక కాంగ్రెస్ నాయకుడు శ్రీనివాస్ మాట్లాడుతూ... మూసీ పరీవాహక ప్రాంతంలో కేసీఆర్‌తో పాటు బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్‌కు ఇంటిని, బెడ్డును ఏర్పాటు చేశామన్నారు. వారు ఉండేందుకు మంచినీళ్లు, సోఫాలు, బకెట్లు, కార్పెట్లు... ఇలా అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేశామన్నారు. ఈ ఒక్కరోజు తమతో ఉండాలన్నారు. ఈ ప్రాంతంలో ఉంటే గానీ ఇక్కడి ప్రజల బాధలు అర్థం కావన్నారు.కేసీఆర్‌కు జూబ్లీహిల్స్‌లో బంగ్లా, ఎర్రవెల్లిలో ఫాంహౌస్ కావాలని... కానీ మూసీ ప్రాంతంలో ఉంటే కానీ వారికి తమ సమస్యలు అర్థం కావన్నారు. తమ సవాల్‌ను స్వీకరించి వారు ఇక్కడ నివసించేందుకు రావాలని సూచించారు. వారు వస్తే స్వాగతం పలికేందుకు మహిళలు పూలదండలతో సిద్ధంగా ఉన్నారన్నారు. ఈ మేరకు కాంగ్రెస్ నాయకులు ఏర్పాటు చేసిన ఇంటికి ఓ వైపు కేసీఆర్, మరోవైపు ఈటల ఫొటోలను ఏర్పాటు చేశారుమూసీ పరీవాహక ప్రాంతం నుంచి డబుల్ బెడ్రూం ఇళ్లకు ఇక్కడి వారిని తరలిస్తున్నందుకు కాంగ్రెస్ నాయకులు, మూసీ ప్రభావిత ప్రజలు... ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి పాలాభిషేకం చేశారు. తమను ఇక్కడి నుంచి తరలించి... డబుల్ బెడ్రూం ఇళ్లను కేటాయించడం పట్ల ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. ప్రభుత్వం కేటాయించిన డబుల్ బెడ్రూంలలో ఉండేందుకు ఇక్కడి వారు సిద్ధంగానే ఉన్నారని స్థానిక కాంగ్రెస్ నేతలు వెల్లడించారు.


## తెలంగాణలోని పలు ప్రాంతాల్లో

# రెండు రోజుల పాటు వర్షాలు

**తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు**

**ఆదిలాబాద్, నిజామాబాద్, హైదరాబాద్ సహా పలు ప్రాంతాల్లో వర్షాలు**

**వెల్లడించిన హైదరాబాద్ వాతావరణ కేంద్రం**



తెలంగాణలో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశముందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది. రెండు రోజుల పాటు ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు కురిసే అవకాశముందని వాతావరణ శాఖ తెలిపింది.ఈరోజు ఆదిలాబాద్, కొమురంభీమ్ ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, సిద్దిపేట, హైదరాబాద్, మేడ్చల్, మల్కాజ్‌గిరి, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి జిల్లాల్లో అక్కడక్కడా వర్షం కురిసే అవకాశముందని తెలిపింది.
రేపు కొమురంభీమ్ ఆసిఫాబాద్, మంచిర్యాల, నిజామాబాద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, కామారెడ్డి జిల్లాల్లో అక్కడక్కడా వర్షం కురిసే అవకాశముందని తెలిపింది.

# అభివృద్ధి లక్ష్యంగా వేసే అడుగులకు సైనికులే రక్షకులు

(మొదటి పేజీ తరువాయి)
దేశ ఐక్యతను దెబ్బతీసేందుకు కొన్ని శక్తులు ప్రయత్నిస్తున్నాయని ప్రధాని నరేంద్రమోదీ అన్నారు. దేశ ఐక్యతను దెబ్బతీసే వారి కుట్రలను తాము ఎట్టి పరిస్థితుల్లోనూ సాగనివ్వబోమన్నారు. ఎలాంటి వివక్ష లేకుండా కేంద్రం పథకాలను అందిస్తోందని స్పష్టం చేశారు. అర్హత ఉంటే చాలు... కేంద్ర పథకాలను అందిస్తున్నామన్నారు. తాము అధికారంలోకి వచ్చాక వన్ నేషన్... వన్ ట్యాక్స్, వన్ నేషన్ వన్ పవర్ గ్రిడ్, వన్ నేషన్ వన్ రేషన్ కార్డు విధానాలను తీసుకువచ్చామన్నారు. వన్ నేషన్ వన్ ఎలక్షన్ కూడా అమలు జరిగితే ఇది దేశ వికాసానికి దోహదం చేస్తుందన్నారు.

గుజరాత్‌లోని కెవాడియాలో ఉన్న సర్దార్ వల్లభాయ్ పటేల్ విగ్రహానికి ప్రధాని మోదీ ఇవాళ నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... మనదేశంలోని ఏకత్వాన్ని పటేల్ రక్షించారన్నారు. పటేల్ అనేక తరాలకు స్ఫూర్తి కలిగిస్తున్నారని పేర్కొన్నారు. దేశమంతా ఒక్కతాటిపై ఉండాలని పటేల్ ఎప్పుడూ కోరుకున్నారన్నారు. కొత్త లక్ష్యాల దిశగా భారత్ నిరంతరం ముందుకు వెళ్లాలని పటేల్ చెప్పేవారన్నారు.మన ఉన్నతికి, వికాసానికి, ఉనికికి మూలం మాతృభాష... అందుకే స్థానిక భాషలన్నింటికీ కేంద్రం అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. ఐదు భాషలకు క్లాసికల్ లాంగ్వేజెస్ హోదాను ఇచ్చామని వెల్లడించారు. ఏటా ఎన్నికల వల్ల దేశ ప్రగతి కుంటుపడుతోందన్నారు. దేశ ప్రగతికి అడ్డుగోడలా ఉన్నదనే ఆర్టికల్ 370ని తొలగించామన్నారు. సెక్యులర్ సివిల్ కోడ్ దిశగా మనం అడుగులు వేస్తున్నామన్నారు.ఇప్పుడు ప్రపంచ దేశాలన్నీ భారత్ వైపు చూస్తున్నాయని ప్రధాని అన్నారు. భారత్‌తో కలిసి నడిచేందుకు అనేక దేశాలు ముందుకు వచ్చాయన్నారు. ఏకతా మంత్రాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ బలహీనం కానివ్వబోమన్నారు. ఏకతా మంత్రం వల్లే దేశ ప్రగతి చక్రాలు పరుగులు తీస్తాయన్నారు. నేడు మన దేశం చేసే ప్రతి పనిలో దేశ సమైక్యత స్పష్టంగా కనిపిస్తోందన్నారు. కశ్మీర్, ఈశాన్య భారతం రైలుతో దేశానికి కనెక్ట్ అయ్యాయన్నారు.గత ప్రభుత్వం నీతి, నిబద్ధతల్లో వివక్ష భావాలు దేశ సమైక్యతను దెబ్బతీశాయన్నారు. గత పదేళ్లలో వివక్షను తొలగించేందుకు నిర్విరామంగా పని చేశామన్నారు. హర్ ఘర్ జల్ స్కీంతో ప్రతి ఇంటికి నీటిని అందించామని, ఆయుష్మాన్ భారత్ వల్ల ప్రతి వ్యక్తి లబ్ధి పొందుతాడన్నారు.

# జాతీయ సమైక్యతకు పునాదులు వేసింది సర్దార్ వల్లభాయ్ పటేల్..

## శ్రీరాములు అందెల.. పారిశుద్ధ్య కార్మికుల సేవలు వెలకట్టలేనివి




ప్రజావినికిడి,(తుక్కుగూడ):
మహేశ్వరం నియోజకవర్గం తుక్కుగూడ మున్సిపాలిటీ రావిర్యాల గ్రామంలోని సర్దార్ పటేల్ యువజన సంఘం ఆధ్వర్యంలో నిర్వహించినటువంటి సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి ఉత్సవానికి ముఖ్యఅతిథిగా బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, మహేశ్వరం నియోజకవర్గం ఇంచార్జ్ అందెల శ్రీరాములు యాదవ్ హాజరై సర్దార్ వల్లభాయ్ పటేల్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం శ్రీరాములు సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతిని పురస్కరించుకొని పారిశుద్ధ్య కార్మికులకు వారి సేవలకు గాను చిరు సత్కారాన్ని అందించారు.ఈ సందర్భంగా శ్రీరాములు మాట్లాడుతూ సర్దార్ వల్లభాయ్ పటేల్ జాతీయ ఐక్యత కోసం ఎంతగానో పాటుపడిన వారు అని భారత స్వాతంత్ర పోరాటం అనంతరం పటేల్ చొరవతోనే 530 సంస్థానాలు కు పైగా భారత్ లో విలీనమై దేశం ఏకమైందన్నారు. మన తెలంగాణ రాష్ట్రాన్ని నిజాం నిరంకుశ పాలన నుండి విడిపించిన మహనీయుడు పటేల్ ని కొనియాడారు. అదేవిధంగా పారిశుద్ధ్య కార్మికుల సేవలు వెలకట్టలేమని వారు లేనిదే ప్రజారోగ్యం లేదని కోవిడ్ సమయంలో ప్రాణాలను కూడా లెక్కచేయక విధులు నిర్వహించిన తీరు మరువలేనిదని అన్నారు.ఈ కార్యక్రమంలో తుక్కుగూడ మున్సిపల్ చైర్మన్ బరిగల హేమలత రాజు గౌడ్,స్థానిక కౌన్సిలర్లు శివకుమార్ గౌడ్, కాంటేకర్ మధుమోహన్,బోధ యాదగిరి రెడ్డి, జాపాల భావన సుధాకర్,బిజెపి సీనియర్ నాయకులు తలారి శ్రీనివాస్, యువజన సంఘం అధ్యక్షులు లింగం బిక్షపతి,యువజన సంఘం సీనియర్ సభ్యులు వెంకటాచారి,లింగం నరసింహ,గున్నాల పర్వతాలు,గున్నాల రవి,పొలమోని సుయోధన,ఎరుకల దశరథ్,బిజెపి, బీజేవైఎం నాయకులు గ్రామస్తులు పాల్గొన్నారు.

# శతాబ్దాల నాటి శాపం.. దీపావళికి ఆ ఊరు దూరం!

హైదరాబాద్‌ప్రజావినికిడి,:
పూజలు, నోములు, వ్రతాలు, దీపాలు, బాణసంచా పేలుళ్లతో యావత్ దేశం ఘనంగా దీపావళి చేసుకుంటోంది. చీకటిని పారదోలి వెలుగులు నింపే ఈ పండగను ప్రపంచవ్యాప్తంగా ఉన్న ప్రవాసులు కూడా నిర్వహిస్తున్నారు.

అయినప్పటికీ.. హిమాచల్ ప్రదేశ్‌లోని ఓ ఊరు మాత్రం ఈ పర్వదినానికి దూరంగా ఉంది. గతంలో సతీసహగమనానికి గురైన ఓ మహిళ శాపం కారణంగా దీపావళిని జరుపుకోకూడదనే ఆచారాన్ని కొనసాగిస్తోంది.స్థానిక కథనాల ప్రకారం.. హిమాచల్‌ప్రదేశ్‌లోని హమీర్‌పుర్ జిల్లా సమ్మూ గ్రామానికి చెందిన ఓ మహిళ దీపావళి పండగ కోసం పుట్టింటికి బయలుదేరింది. ఆలోపు రాజు ఆస్థానంలో పనిచేస్తున్న తన భర్త చనిపోయాడనే మరణవార్త వచ్చింది. అప్పటికే గర్భిణిగా ఉన్న ఆమె ఈ వార్తతో షాక్‌కు గురయ్యింది. ఆ బాధను భరించలేక.. భర్త చితిపై ఆత్మార్పణం చేసుకుంది. ఊరి ప్రజలు ఎన్నడూ దీపావళి చేసుకోవద్దని శాపం పెట్టిందట. దాంతో అప్పటి నుంచి ఆ ఊరిలో పండగను నిర్వహించడం లేదు.ఒకవేళ దీపావళి చేసుకుంటే ఏదో అపశకునం జరుగుతుందనే భయం ఊరి ప్రజల్లో నెలకొంది. ఆ గ్రామానికి చెందిన వారు ఇతర ప్రదేశాల్లో ఉన్నా.. పండగ చేసుకోరు. కనీసం ప్రత్యేక వంటలు కూడా చేయరు. ఓ కుటుంబం ప్రయత్నించగా.. వారి ఇల్లు అగ్నికి ఆహుతయ్యిందట. శాపం నుంచి బయటపడేందుకు గ్రామస్థులు అనేక పూజలు, యజ్ఞాలు చేసినప్పటికీ ఫలితం లేకపోయింది. దీంతో ఊరు మొత్తం దీపావళి దూరంగా ఉంటోంది. కానీ, ఇక్కడి యువత మాత్రం ఏదో ఒకరోజు దీపావళిని చేసుకుంటామనే ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.



రావికమతం, న్యూస్‌టుడే: హిమాచల్ ప్రదేశ్‌లోనే కాదు, మన తెలుగు రాష్ట్రం ఆంధ్రప్రదేశ్ అనకాపల్లి జిల్లాలోని ఓ గ్రామం ఏడు దశాబ్దాలుగా దీపావళికి దూరంగా ఉంటోంది. ఎందుకని ఆరా తీస్తే గ్రామస్థులు పలు విషయాలు వెల్లడించారు. కిత్తంపేట.. రావికమతం మండలం జడ్.బెన్నవరం పంచాయతీలో ఉందీ గ్రామం. 450 ఇళ్లు.. 1500 జనాభా. శివారు గ్రామమైనా.. జనాభాపరంగా జడ్.బెన్నవరం కంటే పెద్దది. రాజకీయంగా చైతన్యవంతం కావడంతో ఈ ఊరి వారే సర్పంచులుగా ఎన్నికవుతూ వస్తున్నారు. ఊరి వారంతా దీపావళి పండగకు దూరంగా ఉండటం ఆచారంగా వస్తోందని గ్రామస్థులు చెబుతున్నారు. 'మా చిన్నతనం నుంచి ఇప్పటివరకు ఎన్నడూ టపాసులు కాల్చలేద'ని జాజిమొగ్గల మాణిక్యం, ముచ్చకర్ల నూకునాయుడు, జంపా ఈశ్వరరావు పేర్కొన్నారు.'గతంలో అందరిలాగే మా ఊర్లోనూ దీపావళి పండగను ఘనంగా జరుపుకొనే వారం. 70 ఏళ్ల కిందట ఊరంతా పాకలే. గడ్డివాములు, ఆవులు, గేదెలు, మేకలు, గొర్రెలు ఇంటి ఆవరణలోనే ఉండేవి. దీపావళి రోజున దివిటీలు తిప్పుతుండగా నిప్పురవ్వలు పడి ఇళ్లన్నీ కాలిపోయాయి. మూగజీవాలు మృత్యువాత పడ్డాయి. అప్పట్నుంచి అన్నీ అపశకునాలే. ఎన్నడూ లేనివిధంగా దీపావళి సమయంలోనే మరణాలు ఎక్కువగా సంభవించేవి. దివ్వెల పండగ అచ్చిరాలేదు. కీడు జరుగుతోందని నాటి పెద్దలు దీపావళికి దీపాలు వెలిగించడం, దివ్వెలు కొట్టడం మానేశారు. ఎవరూ పండగ చేసుకోవద్దని నిర్ణయించారు. అదే ఆనవాయితీగా వస్తోంది. నాగులచవితి రోజున పుట్టలో పాలు పోసి టపాసులు కాలుస్తా'మని మాజీ సర్పంచి కర్రి అర్జున పేర్కొన్నారు.

# కేసీఆర్ ప్రభుత్వానికి సమయం ఇస్తున్నారు

(మొదటి పేజీ తరువాయి)
కాంగ్రెస్ పార్టీ 420 అబద్ధపు హామీలతో అధికారంలోకి వచ్చిందన్నారు. పదేళ్లు అధికారంలో ఉండటంతో ఆ వ్యతిరేకత వల్లే తాము ఓడిపోయామని తెలిపారు. అధికారంలోకి వచ్చి దాదాపు ఏడాది అయినా ఈ ప్రభుత్వం ప్రజలకు చేసిన మంచి ఏదీ లేదన్నారు. ఇచ్చిన హామీలన్నింటిని నెరవేర్చే వరకు తాము ఈ ప్రభుత్వాన్ని వదిలి పెట్టేది లేదన్నారు.

మన ప్రభుత్వం వచ్చాక ఇప్పుడు అతిగా ప్రవర్తిస్తున్న పోలీసులపై ఏం చర్యలు తీసుకుంటారని ఓ నెటిజన్ ప్రశ్నించగా.. వేచి చూడాలని కేటీఆర్ సూచించారు. హైదరాబాద్ వంటి మహానగరంలో 144 సెక్షన్ విధించడం షాకింగ్‌కు గురి చేసిందన్నారు. తెలంగాణలో బీజేపీ, కాంగ్రెస్ కలిసి పని చేస్తున్నాయన్నారు. తెలంగాణలో ప్రభుత్వం అన్నింటా విఫలమైందన్నారు. ప్రజాసమస్యలపై పోరాటానికి సోషల్ మీడియానే మనముందున్న ప్రత్యామ్నాయమన్నారు.

# చార్మినార్ భాగ్యలక్ష్మి ఆలయంలో దీపావళి..
# వెండి నాణేల కోసం పోటెత్తిన భక్తులు




హైదరాబాద్‌ప్రజావినికిడి,: పాతబస్తీలోని చార్మినార్ భాగ్యలక్ష్మీ అమ్మవారి ఆలయంలో దీపావళి వేడుకలు వైభవంగా జరిగాయి. భారీ సంఖ్యలో భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుంటున్నారు.దీపావళి సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ ట్రస్టీ ఆధ్వర్యంలో భక్తులకు వెండి నాణేలు పంపిణీ చేశారు. ఏడాదంతా అమ్మవారికి భక్తులు సమర్పించిన వెండి కానుకలతో తయారుచేసిన నాణేలను దీపావళి రోజు భక్తులను అందించడం ఇక్కడ ఆనవాయితీగా కొనసాగుతోందని ఆలయ ట్రస్టీ శంభు వివరించారు. వెండి నాణేల కోసం భక్తులు పోటెత్తడంతో ఆ ప్రాంతమంతా జనసంద్రంగా మారింది.

# 'పుష్ప' తరహాలో స్మగ్లింగ్..
## ట్యాంకర్‌లో తరలిస్తున్న గంజాయి పట్టివేత



వాంకిడి:ప్రజావినికిడి,:
పుష్ప సినిమాలో.. పాల ట్యాంకర్‌లో ఎర్రచందనం తరలిస్తున్న సీన్ గుర్తుందా? అదే ప్లాన్‌ను గంజాయి స్మగ్లర్లు అమలు చేశారు. కాకపోతే.. పోలీసులకు అడ్డంగా దొరికిపోయారు.

ఆదిలాబాద్ జిల్లాలో వెలుగు చూసిన ఈ ఘటన పుష్ప సినిమాలోని ఎర్రచందనం స్మగ్లింగ్ సీన్‌ను గుర్తు చేసింది.కుమురం భీం జిల్లా వాంకిడి అంతరాష్ట్ర చెక్ పోస్ట్ వద్ద గురువారం సాయంత్రం పోలీసుల తనిఖీల్లో భారీగా గంజాయి పట్టుబడింది. జిల్లా ఎస్పీ శ్రీనివాసరావు.. కేసు వివరాలను మీడియాకు వెల్లడించారు. ఏపీలో రాజమహేంద్రవరం నుంచి మధ్యప్రదేశ్‌కు వెళ్తున్న ట్యాంకర్ లారీ డ్రైవర్ అనుమానాస్పదంగా కనిపించడంతో చెక్‌పోస్టు వద్ద వాహనాన్ని ఆపి తనిఖీ చేశారు. ట్యాంకర్ మధ్య భాగంలో ప్రత్యేకంగా తాయారు చేసిన అరల్లో 290 కిలోల గంజాయి గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. దీని విలువ రూ.72.50లక్షలు ఉంటుందని పేర్కొన్నారు. డ్రైవర్ బల్వీర్ సింగ్‌ను అరెస్టు చేశామని, ప్రధాని నిందితులను పట్టుకుంటామని ఎస్పీ తెలిపారు. గంజాయి పట్టుకున్న పోలీస్ సిబ్బందిని ఎస్పీ అభినందించారు.

# తెలంగాణలో కలకలం సృష్టిస్తున్న పొలిటికల్ బ్లాక్ బుక్, రెడ్ రెడ్ బుక్..!

హైదరాబాద్‌ప్రజావినికిడి,:
బ్లాక్ బుక్, రెడ్ డైరీ, రెడ్ బుక్ ఈ పదాలు ఇప్పుడు తెలంగాణలో ఎక్కువగా వినిపిస్తున్నాయి. మీ పేర్లు రాసుకుంటున్నాం.. అధికారంలోకి వచ్చాక అంతు తెలుస్తామంటూ బ్లాక్ బుక్, రెడ్ డైరీలను చూపిస్తున్నారు.ఇంతకీ ఎవరి పేర్లు రాస్తున్నారు.. రాసుకని ఏం చేయబోతున్నారు? అన్నదీ రాష్ట్ర వ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది.ఆంధ్రప్రదేశ్ ఎన్నికలకు ముందు టీడీపీ ప్రధాన కార్యదర్శి, ప్రస్తుత మంత్రి నారా లోకేష్ ప్రతిసారీ మాట్లాడుతూ రెడ్ డైరీ ప్రస్తావించారు. అధికారుల పేర్లు రాసుకుంటున్నాను అధికారంలోకి వచ్చాక సంగతి చెప్తాను అంటూ ప్రతిసారి స్టేట్‌మెంట్ ఇచ్చాడు నారా లోకేష్. ఇప్పుడు తెలంగాణలో తాజాగా అలాంటి హెచ్చరికలు వినిపిస్తున్నాయి. హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి బ్లాక్ బుక్ అంటూ తెలంగాణలో ఈ కాన్సెప్ట్ మొదలుపెట్టాడు. ప్రతి ప్రెస్ మీట్‌లోనూ బ్లాక్ బుక్ చూపించి అధికారులకు వార్నింగ్ ఇస్తున్నాడు.మొదటగా హుజూరాబాద్ ఆర్టీఏ అధికారులు, హుజూరాబాద్ ఎంఈవో, ఇలా కొంతమంది పోలీసు అధికారుల పేర్లు రాసుకున్నాను అంటూ ప్రకటించారు. తన ఇంటిపై దాడి జరిగినప్పుడు ఏ పోలీస్ అధికారులు ప్రత్యర్థులకు సహకరించారో వారి పేర్లను నోట్ చేసుకున్నాను అంటూ చెప్పుకొచ్చారు. ఇక తాజాగా తనపై డ్రగ్స్ కేసులో ఇరికించే కుట్ర జరిగిందని, అందుకు సహకరించిన పోలీసు అధికారుల పేర్లను మరోసారి బ్లాక్ బుక్ లో రాసుకున్నాను అంటూ చెప్పారు. వచ్చే ఎన్నికల తర్వాత అధికారంలోకి వచ్చేది బీఆర్ఎస్ పార్టీ అని, అధికారంలోకి వచ్చిన తర్వాత బ్లాక్ బుక్ లో ఉన్న పేర్లు ఉన్నవారికి అన్ని బ్లాక్ డేస్ అంటూ చెప్పారు.ఇక మాజీ మంత్రి హరీష్ రావు కూడా వనపర్తి రైతు ధర్నాలో మాట్లాడుతూ.. అత్యుత్సాహం చూపిస్తున్న పోలీస్ అధికారుల పేర్లను తాను రెడ్ డైరీలో రాసుకుంటున్నాను అంటూ బహిరంగ వేదికపైనే చెప్పారు. అధికారంలోకి వచ్చాక ఏ ఒక్కరినీ వదిలిపెట్టం అన్నారు హరీష్ రావు. ఇదే బీఆర్ఎస్ పార్టీలోని ఇంకొంతమంది నేతలు రెడ్ బుక్ లో ఓవరాక్షన్ చేస్తున్న ఆఫీసర్ల పేర్లు రాసుకుంటున్నామంటూ చెబుతున్నారు. ఇంతకీ ఈ ప్రకటనలు దేనికి సంకేతం..అయితే అధికారులను బెదిరించడానికా అంటే కాదని ఇంటర్నల్‌గా చెప్తున్నారు ప్రతిపక్ష నేతలు. కింద స్థాయి కేడర్ కి, కార్యకర్తలకి ధైర్యం నింపడం కోసమే ఇలాంటి టెక్నిక్స్ వాడుతామని అంటున్నారు. దాంతోపాటు అధికారులను కొంత భయం ఉంటుంది.. ప్రభుత్వాలు మారితే ఇబ్బందులు ఎదుర్కొంటామని సంకేతాలు ఉంటాయని అంటున్నారు. ఆంధ్రప్రదేశ్లో రెడ్ బుక్ లో పేర్లు బయటకు రాకపోయినా కొంతమంది అధికారులు ఇప్పుడు పడుతున్న ఇబ్బందుల ఇందుకు ఉదాహరణ అని చెప్తున్నారు బీఆర్ఎస్ నేతలు. అక్కడ ఐఏఎస్, ఐపీఎస్ నేతలు కేసుల్లో ఇరుక్కుని పడుతున్న కష్టాలను చూసైనా తెలంగాణలో ఉన్న అధికారులు మారాలని కోరుతున్నారు.

ప్రజా వినికిడి
మా అక్షరం-మీ ఆయుధం
తెలుగు దినపత్రిక
శుక్రవారం1 నవంబర్ 2024

# ఎంపీ మల్లురవిని కలిసిన షాద్ నగర్ కాంగ్రెస్ నేతలు..

## దీపావళి శుభాకాంక్షలు స్వీట్లు అందజేసిన నాయకులు..





ప్రజావినికిడి,(షాద్ నగర్):నాగర్ కర్నూల్ ఎంపీ మల్లురవిని హైదరాబాద్ లో ఆయన నివాసంలో షాద్ నగర్ కాంగ్రెస్ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు.దీపావళి పండుగ శుభాకాంక్షలు తెలిపిన షాద్ నగర్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ నేతలు మహమ్మద్ అలీ ఖాన్ బాబర్,రఘు నాయక్, అగ్గనూర్ బస్వ%శీ%, మహ్మద్ ఇబ్రహీం తదితరులు.ఈ సందర్భంగా శాలువాతో ఎంపీ మల్లురవిని సన్మానించి స్వీట్లు అందజేశారు. రాష్ట్ర అభివృద్ధిలో తన వంతు సహకారం అందిస్తూ ఉమ్మడి జిల్లా అభివృద్ధికి కృషి చేస్తున్న ఎంపీ మల్లురవి రాజకీయంగా మరింత అభివృద్ధి సాధించాలని కోరుకున్నట్లు బాబర్ తెలిపారు.

# ఎంపీ డీకే అరుణ ను కలిసిన షాద్ నగర్ బిజెపి యువ నాయకులు



ప్రజావినికిడి,(షాద్ నగర్):
దీపావళి పర్వదినాన్ని పురస్కరించుకొని పాలమూరు పార్లమెంట్ సభ్యులు అరుణను కలిసి దీపావళి శుభాకాంక్షలు తెలియజేసిన షాద్ నగర్ యువ నాయకులు వంశీకృష్ణ జిల్లా కార్యవర్గ సభ్యులు మఠం ఋషి కేష్ బిజెపి నాయకులు బర్మలి జంగయ్య నరసింహ భరత సింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.


# సర్దార్ వల్లభాయ్ పటేల్ ను ఆదర్శంగా తీసుకోవాలి

## హిందూవాహిని అధ్యక్షులు గుడాల రమేష్ ఆధ్వర్యంలో నివాళులు



ప్రజావినికిడి,(షాద్ నగర్):
భారత స్వాతంత్ర సమర యోధుడు, స్వాతంత్రం అనంతరం దాదాపు 530 సంస్థనాలను ఏకం చేసి అవిభాజ్య భారతదేశాన్ని పునరనిర్మించి, తెలంగాణా లో నిజాం నిరంకుశ పాలనను సైనిక చర్యతో అంతమొందించి తెలంగాణకు స్వాతంత్రాన్ని ప్రకటించిన జాతీయ వాది ఉక్కు మనిషి సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి సందర్భంగా ఆయనకు షాద్ నగర్ హిందూవాహిని అధ్యక్షులు గుడాల రమేష్ ఆధ్వర్యంలో నివాళులు అర్పించడం జరిగింది.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హిందూవాహిని రాష్ట్ర నాయకులు చెట్ల వెంకటేష్ పాల్గొని సర్దార్ వల్లబాయ్ పటేల్ వల్లనే ఈ రోజు తెలంగాణ ప్రజలు నిజాం నిరంకుశ రజాకార్ పాలనా నుండి విముక్తి ప్రసాదించారాని,దేశ సమగ్రత నీ కాపాడే విషయం లో ప్రతి ఒక్క యువకుడు పటేల్ ని ఆదర్శంగా తీసుకుని నిరంతరం జాతీయ వాదం కొరకు పాటు పడాలని అన్నారు.ఈ కార్యక్రమం లో జిల్లా కో కన్వీనర్ సళ్ళ మహేష్,ధనరాజ్,సుమన్ గౌడ్,పసులోటి శ్రవణ్,సీఎచ్ కుమార్, లక్ష్మణ్, వీరేందర్, భరత్,రాజుచారీ,శివ కుమార్,క్యామా రమేష్,వంశీ, ప్రవీణ్, శ్రీశైలం,హిందూవాహిని నాయకులు పాల్గొన్నారు.

# దీపావళి శుభాకాంక్షలు




ప్రజావినికిడి,(హైదరాబాద్):
పద్మశాలి కులస్తులకు, భక్తులకు శ్రేయోభిలాషులకు శ్రీశైలం పుణ్యక్షేత్రంలోని అఖిలభారత భక్త మార్కండేయ పద్మశాలీయుల నిత్య అన్నదాన సత్రం అధ్యక్షులు వర్గాల సూర్యనారాయణ దీపావళి శుభాకాంక్షలు తెలిపారు.ఈ దీపావళి అందరి జీవితాల్లో వెలుగుల నింపాలని ఆయన కోరారు.

# దీపావళి సందర్భంగా వేద పండితుల ఆశీర్వాదం అందుకున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్..



ప్రజావినికిడి,(షాద్ నగర్):
దీపావళి పర్వదినాన్ని పురస్కరించుకుని స్థానిక పురోహితులు రవిశర్మ ఆధ్వర్యంలో స్థానిక ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ను ప్రత్యేకంగా కలిసి ఆశీర్వచనాలు అందజేశారు. రాజకీయ అలాగే ప్రాంతా అభివృద్ధి సాధించాలని దీవించారు. శాలువాలతో సత్కరించారు.

# అందే మోహన్ తల్లి ప్రమీలను పరామర్శించిన ఎమ్మెల్యే శంకర్



ప్రజావినికిడి,(షాద్ నగర్): షాద్ నగర్ యువజన కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అందే మోహన్ తల్లి ప్రమీల ఇటీవల అనారోగ్యానికి గురికావడంతో ఈరోజు షాద్ నగర్ పట్టణంలో వారి ఇంటికి వెళ్లి పరామర్శించి, వారి ఆరోగ్య పరిస్థితి పై ఆరా తీసి,తగిన జాగ్రత్తలు పాటించాలని సూచించిన షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్ల పల్లి శంకర్.



## షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ఇంట్లో

# దీపావళి సందడి

## ఎమ్మెల్యేగా తొలి దీపావళి వేడుకలు..



ప్రజావినికిడి,(షాద్ నగర్):
చీకటి వెలుగుల రంగేళి జీవితమే ఒక దీపావళి అంటూ చిన్న పెద్ద తేడా లేకుండా ప్రతి ఇంట్లో దీపావళి సందడి నెలకొంది. రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ పట్టణంలో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ నివాసంలో తన కుటుంబంలోని చిన్నారులతో కలిసి దీపావళి వేడుకలు నిర్వహించుకున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్.. ఎమ్మెల్యేగా మొదటిసారి గెలుపొందాక ఎమ్మెల్యే శంకర్ ఇంట్లో తొలిసారి ఇచ్చిన దీపావళి ఇది కావడంతో కుటుంబ సభ్యులతో ఆయన ఘనంగా పండుగను జరుపుకున్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ,చెడుపై మంచి విజయం సాధించిన రోజు దీపావళి అని, రాష్ట్రంలో కూడా చెడుపోయి మంచి జరిగిందని భవిష్యత్తు కూడా మంచిగానే జరుగుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. నియోజకవర్గ ప్రజలకు అన్ని వర్గాలకు దీపావళి శుభాకాంక్షలు ఎమ్మెల్యే శంకర్ తెలియజేశారు.

# ఇందిర గాంధీ సేవలు మరువలేనివి..

## షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్ల పల్లి శంకర్ నివాళి..

## ఘనంగా ఇందిర గాంధీ వర్ధంతి,సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి..





ప్రజావినికిడి,(షాద్ నగర్):ప్రజా సేవకు తమ రాజకీయ జీవితాన్ని అంకితం చేసి వారిలో నిస్వార్థ నిఖర్సైన నేతల్లో అగ్ర గణ్యులని షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్ల పల్లి శంకర్ కొనియాడారు.ఇందిర గాంధీ వర్ధంతి సందర్భంగా కేశంపేట్ రోడ్డు గల విగ్రహానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు, అనంతరం సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి పురస్కరించుకుని పటేల్ రోడ్డులో ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.పాల్గొన్న వారు మాజీ మున్సిపల్ చైర్మన్ అగ్గనూర్ విశ్వం, పట్టణ అధ్యక్షుడు కొంకళ్ళ చెన్నయ్య, నేతలు,యదయ్య యాదవ్,చెంది తిరుపతి రెడ్డి,అగ్గనూర్ బస్వం, శ్రీనివాస్ యాదవ్, రఘు నాయక్, శ్రీకాంత్ రెడ్డి,ఇబ్రహీం,స్వరర్ పాషా, ప్రకాష్ గౌడ్, సుదర్శన్ గౌడ్,కృష్ణ రెడ్డి,హరినాద్ రెడ్డి బాలరాజు గౌడ్, నర్సింలు, ముబారక్,సయ్యద్ ఖదీర్, జగదీశ్,మన్నే రవి,వాసు,జంగారి రవి,మంగ మధు, లింగారెడ్డి గూడ అశోక్, సీతారాం తదితరులు పాల్గొన్నారు.

# వెలుగుల పండుగ దీపావళి..

## ప్రజల జీవితాల్లో సరికొత్త కాంతులు నింపాలి..

## కేశంపేట్ మాజీ జెడ్పీటిసి తాండ్ర విశాల శ్రావణ్ రెడ్డి..



ప్రజావినికిడి,(షాద్ నగర్):
షాద్ నగర్ నియోజకవర్గ ప్రజలందరికీ దీపావళి పండుగ సందర్భంగా కేశంపేట్ మాజీ జెడ్పీటిసి తాండ్ర విశాల శ్రావణ్ రెడ్డి దీపావళి శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ,రాష్ట్రం అభివృద్ధి దిశలో పయనిస్తోంది.ఈ శుభ సమయంలో విచ్చేసిన..తొలి దివ్య దీపావళికి స్వాగతం.. సుస్వాగతంవెలుగుల పండుగ దీపావళి.. ప్రజల జీవితాల్లో సరికొత్త కాంతులు నింపాలి ప్రతి ఒక్కరూ ఆనందోత్సాహాల మధ్య, సురక్షితంగా..ఈ వెలుగుల పండుగను జరుపుకోవాలి.ఈ దీపాల పండుగ ప్రజల జీవితాల్లో సంపదలు,సౌభాగ్యాలువిజయాలు తీసుకురావాలి. వాతావరణ కాలుష్యం పట్ల అప్రమత్తంగా ఉండి పర్యావరణాన్ని రక్షించు కుందాం మాజీ జెడ్పీటిసి తాండ్ర విశాల శ్రావణ్ రెడ్డి ఆకాంక్షించారు.

# కొందుర్గు మండల కేంద్రంలో ఘనంగా ఏఐటీయూసీ 105వ ఆవిర్భావ దినోత్సవం..

## కార్మికుల హక్కులను కాలరాస్తున్న బిజెపి ప్రభుత్వం బుద్ధుల జంగయ్య..

ప్రజావినికిడి,(కొందుర్గు):
కొందుర్గు మండల కేంద్రంతో పాటు రామచంద్రపుర్ చౌరస్తలో ఏఐటీయూసీ 105వ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించుకున్నారు ఈ సందర్భంగా జెండా ఆవిష్కరించి తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బుద్ధుల జంగయ్య మాట్లాడుతూ, 1920లో బొంబాయి మహానగరంలో ఏఐటియుసి యూనియన్ ఏర్పడదని నాటి నుంచి కార్మికుల పక్షాన నిరంతరం పోరాటాలు నిర్వహిస్తుంది ఏఐటీయూసీ సంఘం అని ఆయన తెలియజేశారు భారతదేశం పరాయి పాలనలో ఉన్న దశలో స్వతంత్రం కావాలని బ్రిటిష్ ప్రభుత్వంలో పని చేస్తున్న కార్మికులకు కనీస వేతనం కావాలని ఎనిమిది గంటల పని దినాలు కావాలని కార్మికుల హక్కుల కోసం బ్రిటిష్ ప్రభుత్వంపై పెద్ద ఎత్తున పోరాడిన సంఘం ఏదైనా ఉందంటే అది ఏ ఐ టి యు సి తప్ప ఇంకోటి కాదు అని ఆయన కొనియాడారు బ్రిటిష్



పాలకులు ఏఐటీయూసీ పోరాటాలకు తలవంగి కార్మికులకు అనేక రకమైన చట్టాలు తీసుకువచ్చారని కానీ నేటి పాలకులు ఆ చట్టాలన్నిటిని కూడా నాలుగు కోడ్లు కిందికి తీసుకువచ్చి సంఘం పెట్టుకునే హక్కును కూడా లేకుండా చేస్తున్నారంటే వీరు ఎవరు పక్షమొ
కార్మికులు ప్రజలు అర్థం చేసుకోవాలని ఆదానీ అంబానీ బడా పెట్టుబడిదారులకు మోడీ ప్రభుత్వం కొమ్మికాస్తూ కార్మికుల హక్కులను కాలరాస్తుందని ఆయన దుయ్యబట్టారు హక్కులను రక్షించుకోవాలంటే పోరాటాలే మార్గమని పోరాటాలకు కార్మిక వర్గం సిద్ధంగా ఉండాలని కార్మికులకు పిలుపునిచ్చారు కార్మికులు కర్షకులు ఏకమై పోరాటాలు నిర్వహిస్తేనే పాలక ప్రభుత్వాలు కార్మిక చట్టాలను కనీస వేతనాలను అమలుపరుస్తాయని ఆయన తెలిపారు.ఈ కార్యక్రమంలో సిపిఐ కొందుర్గు మండల కార్యదర్శి భాగాల నరసింహ చౌదర్ గూడా మండల కార్యదర్శి జి.వెంకటేష్ ఏఐటీయూసీ నాయకులు జంగయ్య రాములు చంద్రయ్య గ్రామపంచాయతీ వర్కర్స్ యూనియన్ నాయకులు ఎం జంగయ్య రషీద్ రాజు అంగన్వాడి మండల అధ్యక్షులు సువర్ణ మల్లేష్ లక్ష్మయ్య వ్యాకాస నాయకులు ఎం కృష్ణ తదితరులు పాల్గొన్నారు..

# దీపావళి పూజలో సమంత..

## ట్రెడిషనల్ లుక్‌కు ఫ్యాన్స్ ఫిదా



స్టార్ హీరోయిన్ సమంత మరోసారి సోషల్ మీడియాలో తన కొత్త లుక్ తో మెరిసిపోయింది. దీపావళి సందర్భంగా ప్రత్యేక పూజల్లో పాల్గొంటూ తన అందమైన ట్రెడిషనల్ లుక్ తో ఫొటోలు పోస్ట్ చేసి, ఫ్యాన్స్ ను ఫిదా చేసింది. ఈ సీజన్ లో అందరికీ శుభాకాంక్షలు చెబుతూ.. ప్రతి రోజు ఒక సంబరంలా గడుపుదామని కోరుకుంటూ ఒక సందేశాన్ని పంచుకుంది. సమంత ఈ ఫొటోలను సిక్స్ సెన్సెస్ ఫోర్ట్ బర్వారాలో తీసింది. ఆమె కుర్తాలో అందంగా ఆకట్టుకునే విధంగా కనిపించింది. పూజా కార్యక్రమాల్లో పాల్గొంటూ ఆమె దీపం వెలిగిస్తోన్న ఫొటోను పోస్ట్ చేసింది. దీంతో పాటు పూజా మందిరంలో దేవుడికి హారతి అందజేస్తూ మరొక ఫొటోను షేర్ చేసింది. ఈ ఫొటోల్లో సమంత అందంతో పాటు భక్తి భావనతో కూడిన హావభావాలతో తన అభిమానులను అలరించింది.పూలతో అలంకరించిన రంగోలి, ప్రాచీన శిల్ప కళాకృతులతో ఉన్న దేవాలయం అందరి మనసులను ఆకర్షించింది. ఇది చూసిన తర్వాత నెటిజన్లు ఆమెకు ప్రశంసలు కురిపిస్తూ లైకుల వర్షం కురిపిస్తున్నారు. ప్రస్తుతం బాలీవుడ్ లో పలు వెబ్ సిరీస్ లలో సమంత నటిస్తుండటం తెలిసిందే. 'సిటాడెల్' అనే యాక్షన్ డ్రామా తో నవంబర్ లో ప్రేక్షకుల ముందుకు రానుంది. అలాగే ఆమె ఒక హిస్టారికల్ బ్యాక్ డ్రాప్ సిరీస్ లో యువరాణి పాత్రలో కనిపించనుంది. అయితే ఈ ట్రెడిషనల్ లుక్ లో ఆమె మరింత అందంగా కనిపిస్తూ.. హార్ట్ విన్నింగ్ ఎక్స్ ప్రెషన్స్ తో ఫ్యాన్స్ కు ఫెస్టివ్ ట్రీట్ ఇచ్చినట్లు చెప్పవచ్చు. కేవలం సినిమాలతోనే కాకుండా డిజిటల్ స్పేస్ లో కూడా సమంత తన సత్తా చాటుతోంది. కానీ ఆమె తెలుగులో కూడా మరో మంచి సినిమా చేయాలని ఫ్యాన్స్ ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు.

# 'గేమ్ చేంజర్' నుంచి దీపావళి రోజున స్పెషల్ అప్ డేట్




గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ అభిమానుల్లో గేమ్ చేంజర్ చిత్రం పట్ల ఆసక్తి అంతకంతకు పెరిగిపోతోంది. సినిమా రిలీజ్ డేట్ (2025 జనవరి 10) అనౌన్స్ చేసినప్పటి నుంచి... ఎప్పుడెప్పుడా అని ఫ్యాన్స్ తహతహలాడుతున్నారు. ఈ క్రమంలో నేడు దీపావళి సందర్భంగా అందరికీ శుభాకాంక్షలు తెలిపిన చిత్ర బృందం... గేమ్ చేంజర్ నుంచి ఆసక్తికర కబురు అందించింది. నవంబరు 9న టీజర్ రిలీజ్ చేస్తున్నట్టు మేకర్స్ వెల్లడించారు. వెలిగించేద్దాం అంటూ అభిమానుల్లో ఉత్సాహం నింపారు.

తాజా అనౌన్స్ మెంట్ తో మెగాభిమానులు, సినీ ప్రేక్షకుల్లో ఎగ్జయిట్‌మెంట్ మరింత పెరిగింది. టీజర్ రిలీజ్ అనౌన్స్‌మెంట్ పోస్టర్ గమనిస్తే రైల్వే ట్రాక్‌పై కూలింగ్ గ్లాస్ పెట్టుకుని లుంగీ, బనియన్‌తో పక్కా మాస్ లుక్‌లో కూర్చున్న రామ్ చరణ్‌ను చూడొచ్చు. మ్యూజిక్ డైరెక్టర్ తమన్ ఈ లుక్ ఉన్న పోస్టర్‌ను పోస్ట్ చేసి గేమ్ చేంజర్‌లో ట్రైన్ ఫైట్ ఉండబోతుందని, ఆ ఫైట్ అందరి అంచనాలను మించేలా ఉంటుందని చెప్పటంతో అంచనాలు నెక్ట్స్ లెవల్‌కు చేరుకున్నాయి.

రామ్ చరణ్, కియారా అద్వానీ జంటగా తెరకెక్కుతున్న ఈ భారీ చిత్రానికి శంకర్ దర్శకుడు. వాణిజ్య విలువలు మిస్ కాకుండా సామాజిక బాధ్యతతో కూడిన సందేశాత్మక చిత్రాలు తెరకెక్కించడంలో శంకర్ దిట్ట. ముఖ్యంగా అవినీతి నిర్మూలన శంకర్ సినిమాల్లో మెయిన్ టాపిక్ గా ఉంటుంది. ఇప్పుడు గేమ్ చేంజర్ చిత్రం కూడా ఆ కోవలోనే తెరకెక్కుతున్నట్టు తెలుస్తోంది. ఆర్‌ఆర్‌ఆర్ తో వరల్డ్ వైడ్ పాప్యులారిటీ సంపాదించుకున్న రామ్ చరణ్... గేమ్ చేంజర్ తో మరో మెట్టు పైకి ఎక్కడం ఖాయమని చిత్రబృందం ధీమా వ్యక్తం చేస్తోంది. శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ పతాకంపై దిల్ రాజు ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. జీ స్టూడియోస్ కూడా ఈ చిత్ర నిర్మాణంలో పాలుపంచుకుంటోంది. ఈ చిత్రానికి తమన్ సంగీత దర్శకుడు. ఎస్ జె సూర్య, శ్రీకాంత్, అంజలి, సునీల్, నవీన్ చంద్ర తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు.

# లేటు వయసులో సీనియర్ తారల ప్రేమ పెళ్లి సరాగాలు






మనసుండాలే కానీ వయసుతో పనేంటి? ఇలా ప్రశ్నించే తారలకు కొదవేమీ లేదు. లేటు వయసులోను పెళ్లితో పరిపూర్ణతకు దారి వెతికేవారున్నారు. ఇక్కడ పిక్చర్ లో కనిపిస్తున్న జంటను చూడగానే ముచ్చటేస్తోంది కదూ! కాస్త లేటు వయసే కానీ, ఎంతో ముచ్చటగా కనిపిస్తున్నారు. ఈడు జోడు బాగా కుదిరింది. మలయాళం టీవీ నటులు క్రిస్ వేణుగోపాల్ - దివ్య శ్రీధర్ గురువాయూర్ ఆలయంలో జరిగిన ప్రైవేట్ వేడుకలో అధికారికంగా వివాహం చేసుకున్నారు. కుటుంబం సభ్యులు, స్నేహితుల సమక్షంలో ఈ జంట పెళ్లి ప్రమాణాలు చేసారు. క్రిస్ వేణుగోపాల్ బుల్లితెర పరిశ్రమలో సుపరిచితమైన పేరు. అతడు జనాదరణ పొందిన సీరియల్స్‌లో నటించడమే కాకుండా రచయిత, వాయిస్ ఆర్టిస్ట్ కూడా. దివ్య శ్రీధర్ కూడా టీవీ రంగంలో ప్రతిభావంతులైన నటి, వివిధ టెలివిజన్ ప్రాజెక్ట్‌లలో తన పాత్రలతో మెప్పించారు. ఆమె ముఖ్యంగా నెగిటివ్ రోల్స్, క్యారెక్టర్ రోల్స్‌లో ఆకర్షణీయమైన నటనతో పాపులరయ్యారు. సీరియల్ వీక్షకులకు ఆమె సుపరిచితమైన ముఖం. ఇద్దరు నటులు ప్రముఖ సీరియల్ పాతరమట్టులో కలిసి పని చేస్తున్నప్పుడు మొదటిసారి కలుసుకున్నారు. ఈ సీరియల్ లో వారు ప్రధాన పాత్రలను పోషించారు. అనంతమూర్తిగా క్రిష్ నటిస్తుండగా, నెగటివ్ షేడ్ ఉన్న పాత్రలో దివ్య నటిస్తోంది. దివ్య కు ఇది రెండో వివాహం. ఆమెకు మునుపటి వివాహం నుండి ఇద్దరు పిల్లలు ఉన్నారు. రెండో పెళ్లితో ముందుకు వెళ్లే ముందు పిల్లలతో తన నిర్ణయాన్ని చర్చించడానికి ఆమె కొంత సమయాన్ని వెచ్చించింది. వివాహం వ్యక్తిగతమైనది.. అర్థవంతమైన జీవితం కోసం జంట కోరికను ప్రతిబింబించే ఒక సన్నిహిత వ్యవహారం. క్రిస్ - దివ్య ఇద్దరూ అభిమానులు, వినోద పరిశ్రమలోని సహోద్యోగుల నుండి హృదయపూర్వక శుభాకాంక్షలు అందుకున్నారు. వారికి ప్రత్యేక శుభాకాంక్షలు.

# నందమూరి అభిమానులకు 2025 అతి పెద్ద పండగ!





ఒకేసారి ఇద్దరు నందమూరి వారసులు పరిచయం అవ్వడం అన్నది అభిమానులుకు అతి పెద్ద గుడ్ న్యూస్. అందులో నటసింహ బాలకృష్ణ తనయుడు మోక్షజ్ఞ ఒకరైతే? హరికృష్ణ మనవుడు, జానకీ రామ్ కుమారుడు తారక రామారావు మరొకరు. ఇప్పటికే మోక్షజ్ఞ ఎంట్రీ చిత్రం ఖరారైంది. పాన్ ఇండియాలో సంచలనమైన ప్రశాంత్ వర్మకు తనయుడి బాధ్యతలు అప్పగించారు బాలయ్య. తొలి చిత్రమే భారీ బడ్జెట్ తో ప్లాన్ చేస్తున్నారు. ప్రస్తుతం ప్రశాంత్ వర్మఆ సినిమా పనుల్లోనే బిజీగా ఉన్నాడు. నందమూరి మాస్ ఇమేజ్ ని పక్కనబెట్టి మోక్షజ్ఞని తొలి సినిమాతో పాన్ ఇండియా మార్కెట్ కి కనెక్ట్ చేసేలా ముందుకెళ్తున్నాడు. ఈ విషయంలో బాలయ్య ఎంతో తెలివిగా వ్యవరించారన్నది అర్దమవుతుంది. ఇక హరికృష్ణ మనవడు తారకరామారావు కూడా హీరో మెటీరియల్. అందులో ఎలాంటి డౌట్ లేదు. అతడి లాంచింగ్ కోసం ఏకంగా వై.వీఎస్ చౌదరి రంగంలోకి దిగాడు.ఇప్పటికే తారకరామారావు ఫస్ట్ లుక్ పోస్టర్ కూడా రిలీజ్ అయింది. చూస్తుంటే అర్జున్ రెడ్డి ఫీల్ ని తీసుకొా స్తున్నాడు. అతడిలో ఉన్న ఎనర్జీని చౌదరి పర్ఫెక్ట్ గా బయటకు తీయగలడు. అందులో ఎలాంటి డౌట్ లేదు. వారసులను పరిచయం చేయడంలో చౌదరి స్పెషలిస్ట్. మరి ఈసారి ఎలాంటి కంటెంట్ తో వస్తున్నాడు? అన్నది చూడాలి. అయితే ఈ రెండు విషయాలు నందమూరి అభిమానులు పండగ లాంటిందే. ఒకేసారి ఇద్దరు లాంచ్ అవ్వడం అన్నది డబుల్ ట్రీట్ అవుతుంది. హీరోలిద్దరు వచ్చే ఏడాది ప్రేక్షకుల ముందుకు వచ్చే అవకాశం ఉంది. ఉయ్ ఆర్ వెయిటింగ్ అంటూ అభిమా నులు ఇప్పటినుంచే ఎదురు చూడటం మొదలు పెట్టారు. ఎన్టీఆర్ తర్వాత అదే ఫ్యామిలీ నుంచి బాలయ్య, హరికృష్ణ, జూనియర్ ఎన్టీఆర్ సహా కొంత మంది వచ్చారు. కానీ వీళ్లు సక్సెస్ అయినంతగా మిగతా వారు సక్సెస్ కాలేదు. అయితే ఆ రేంజ్ అంచనాలు మాత్రం మోక్షజ్ఞ, తారకరామారావుపై భారీగా ఉన్నాయి.

# లేడీ జాక్ క్రేజీ లుక్స్.. బేబీ ఫెస్టివల్ వైబ్ అదుర్స్..!





బేబీ సినిమాతో సూపర్ హిట్ అందుకున్న వైష్ణవి చైతన్య ఆ సినిమాతో యూత్ ఆడియన్స్ లో మంచి క్రేజ్ ఏర్పరచుకుంది. అమ్మడు ముందు షార్ట్ ఫిలిమ్స్ చేసి ఆ తర్వాత చిన్న చిన్న రోల్స్ చేసి ఫైనల్ గా హీరోయిన్ అయ్యింది. ఐతే బేస్ ఎంత స్ట్రాంగ్ గా ఉంటే కెరీర్ అంత స్ట్రాంగ్ గా ఉంటుందని అనుకుంటే బేబీ హిట్ పడ్డాక అమ్మడికి ఫ్లాప్ రుచి తగిలింది. ఆశిష్ తో లవ్ మీ సినిమా చేసిన వైష్ణవి చైతన్య ఆ సినిమాతో డిజాస్టర్ ఫేస్ చేసింది. సినిమా సక్సెస్ ఫెయిల్యూర్స్ అనేవి చెప్పడం కష్టం ఐతే ఎంచుకున్న పాత్రలను బట్టి సినిమా రిజల్ట్ మీద డిపెండ్ అవ్వకుండానే హీరోయిన్స్ క్రేజ్ వస్తుంది. బేబీతో వైష్ణవి పేరు మారు మోగిపోయింది. లవ్ మీ ఫ్లాప్ అయినా ప్రస్తుతం అమ్మడి స్టార్ బోయ్ సిద్ధు జొన్నలగడ్డతో జాక్ సినిమాలో నటిస్తుంది. వైష్ణవి కెరీర్ మళ్లీ ట్రాక్ లోకి ఎక్కాలంటే జాక్ కంపల్సరీ హిట్ కొట్టాల్సిందే. ఐతే జాక్ సినిమా అప్డేట్స్ ఇంకా రివీల్ చేయలేదు కానీ దీపావళి సందర్భంగా వైష్ణవి నో ఫిల్టర్స్ లుక్ తో సర్ ప్రైజ్ చేసింది. కథానాయికలు తమ న్యాచురల్ లుక్ తో కనిపిస్తే ఆ కిక్ వేరేలా ఉంటుంది. పండుగ రోజు అనవసరమైన మేకప్ ఎందుకు అనుకుందో ఏమో కానీ బేబీ వైష్ణవి చైతన్య న్యాచురల్ లుక్స్ అదిరిపోయింది. పండుగ శోభ అంతా తన ఇంట్లోనే అనేలా అమ్మడు తన లుక్స్ తో ఆకట్టుకుంది. ముఖ్యంగా ఈమధ్య ప్రతి ఒక్కరు మేకప్ లేకపోయినా ఫిల్టర్స్ వాడి మరీ బాగా అందంగా కనిపించాలని ట్రై చేస్తున్నారు. కానీ బేబీ వైష్ణవి మాత్రం తన సహజత్వంతో ఆకట్టుకుంటుంది. బేబీ షేర్ చేసిన ఈ మేకప్ లెస్ ఫోటోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. శారీ లో తన క్యూట్ లుక్స్ తో చూపు మరల్చ లేనంతగా కవ్విస్తుంది వైష్ణవి.

# దీపావళి సెలబ్రేషన్స్.. ఫ్యామిలీతో స్టార్ హీరోలు..



స్టార్ హీరోలు ఎన్టీఆర్ , అల్లు అర్జున్ తదితరులు కుటుంబంతో కలిసి దీపావళి పండగను సెలబ్రేట్ చేసుకున్నారు.ఆ ఆనందకర క్షణాలను కెమెరాల్లో బంధించి.. సోషల్ మీడియా వేదికగా అభిమానులతో పంచుకుంటూ పండగ శుభాకాంక్షలు తెలిపారు. అవి నెట్టింట వైరల్‌గా మారాయి. తన సతీమణి ప్రణతి, ఇద్దరు కుమారులతో కలిసి దిగిన ఫొటోను ఎన్టీఆర్ షేర్ చేశారు. ఓ వీడియోలో.. తన కుటుంబంతో కలిసి అల్లు అర్జున్ సెల్ఫీ తీసుకుంటూ కనిపించారు. తన సోదరుడు, నటుడు ఆనంద్‌తో కలిసి విజయ్ దేవరకొండ టపాసులు పేల్చారు.



Printed , Published and Owned by Marepally Ashok , Printed at Dilip Offset Printers, H.NO. 4-110, Durga Nagar, Dilsukhnagar, Hyderabad , Ranga Reddy District - 500060 and Published from H. No 18-353/1,Vijaya Nagar Colony, Hajipally Road, Farooq Nagar, Ranga Reddy District — 509216 Telangana State.
Editor : Marepally Ashok, RNI.No :TELTEL/2023/85745. E mail id : ashok.laghs123@gmail.com. Cell. No: 8978701613